పండగ శోభ



నల్లకుంట: భారత సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఆధునిక, సాంకేతికతను కలబోస్తూ.. నేటి తరానికి నచ్చే రీతిలో అనేక డిజైన్లలో వ్యాపారులు ప్రమిదలు, లక్ష్మీదేవి ప్రతిమలు, దొంతులను అందుబాటులోకి తీసుకొచ్చారు. అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలో పెద్ద ఎత్తున దుకాణాలు ఏర్పాటయ్యాయి. దీంతో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మహిళలే కాకుండా పురుషులు సైతం దుకాణాలకు వచ్చి ప్రమిదలు, లక్ష్మీదేవి ప్రతిమలను కొనుగోలు చేస్తూ కనిపించారు.

ఆకర్షణీయ ప్రమిదలు..

ఇంటి ముంగిట ఆకర్షణీయంగా ఉండే వెరైటీ దీపాలను కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. ఒకప్పుడు మట్టి దీపాలు మాత్రమే అందుబాటులో ఉండేవి. అయితే ఇప్పుడు మట్టి ప్రమిదలతో పాటు పింగాణి, విద్యుత్ ద్వారా వెలిగే దీపాలు సైతం అందుబాటులోకి వచ్చాయి. ఒక్కొక్క దీపం ధర రూ.10 నుంచి రూ.250 వరకు పలుకుతోంది.

జోరుగా దివ్వెల విక్రయాలు..

నల్లకుంట శంకరమఠం మార్కెట్, శివం రోడ్డు మార్కెట్, గోల్నాక మార్కెట్ తదితర ప్రాంతాల్లో టెర్రకోట కళాకారులు ప్రత్యేకంగా దీపావళి కోసం తయారు చేసిన దివ్వెలను విక్రయిస్తున్నారు. వీటితో పాటు తులసి, ఆకు, గిన్నె, లాంతరు, నారికేళం తదితర సుమారు 20 రకాల ఫ్యాబ్రిక్ పెయింటింగ్ దీపాలను వివిధ ఆకృతుల్లో రూపొందించారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కుమ్మరులతో పాటు హ్యాండీక్రాఫ్ట్ షాపుల్లో దీపాలు అమ్మకాలకు పెట్టారు. రూ.10 నుంచి రూ.300 వరకు విలువైన దీపాలు ఉన్నట్లు అమ్మకందారులు తెలిపారు.



నల్లకుంట శివం రోడ్డులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న టెర్రకోట ప్రమిదలు



బాగ్ అంబర్‌పేటలో మట్టితో తయారు చేసిన ప్రమిదల విక్రయాలు

నవంబర్ 6న బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనోత్సవం



బొడ్రాయి పునఃప్రతిష్ఠ కరపత్రాన్ని విడుదల చేస్తున్న దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు

అంబర్‌పేట: అంబర్‌పేట మహంకాళి దేవాలయ ఆవరణలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా నిర్వహిస్తామని అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రధాన సలహాదారు దుర్గాప్రసాద్‌రెడ్డి, అధ్యక్షులు శంకర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఆలయం ప్రాంగణంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవంబర్ 6న బొడ్రాయి ఏర్పాటుకు భూమిపూజ నిర్వహిస్తామని తెలిపారు. 18, 19, 20వ తేదీల్లో పూజలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, వైఎస్ చైర్మన్ గడ్డం లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్, గిరిధర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, కిశోర్, సీహెచ్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా పోరాడాలి



ఎంసీపీఐయూ జాతీయ సెమినార్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గాదగోని రవి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దేశంలో కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా పోరాడాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పులుపునిచ్చారు. కమ్యూనిస్టుల ఐక్యత లోపం వల్లనే దేశ ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యా, ఉద్యోగాలలో అణచివేతకు గురవుతున్నారని అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఎంసీపీఐ కార్యాలయంలో ఈనెల 7న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే జాతీయ సెమినార్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గాదగోని రవి మాట్లాడుతూ... కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతుందని విమర్శించారు. ప్రజాపక్ష మేధావులు, విద్యావంతులు, ప్రజాతంత్ర వాదులు జాతీయ సెమినార్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనం సుధాకర్, కుంభం సుఖన్య, తాండ్ర కళావతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సీపీఎల్ కమాండెంట్ మీర్జా అలీబేగ్

అంబర్‌పేట: పోలీసు విభాగం నిర్వహించే పోటీల్లో ప్రేమ్‌నగర్ హైమావతి పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. ఇటీవల పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సెంట్రల్ పోలీసు లేన్‌లో సైబర్ నేరాలను అరికట్టడంలో యువత పాత్ర అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థి పూజ్యశ్రీ ప్రథమ బహుమతి, అలీన ఆర్షి ద్వితీయ బహుమతులు పొందారు. గెలుపొందిన విద్యార్థులకు కమాండెంట్ మీర్జా అలీబేగ్ బహుమతులు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిరంజన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

హైదరాబాద్ అడిషనల్ సీపీ ట్రాఫిక్ విశ్వప్రసాద్



ఆర్టీసీ కాచిగూడ డిపో ఆదర్శ ఉద్యోగులను అభినందిస్తున్న విశ్వప్రసాద్

కాచిగూడ: ప్రమాదాల నివారణ అందరి బాధ్యతని హైదరాబాద్ అడిషనల్ సీపీ ట్రాఫిక్ పి.విశ్వప్రసాద్ అన్నారు. ఆర్టీసీ కాచిగూడ డిపోలో బుధవారం జరిగిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ రూల్స్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు ఆర్టీసీ డ్రైవర్లు కృషి చేయాలన్నారు. వాహనాన్ని నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బస్సులో ప్రయాణించే ప్రయాణికుల భద్రత తమపై ఆధారపడి ఉంటుందన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే వాహనాన్ని నడపాలని, లేని పక్షంలో తగిన విశ్రాంతి తీసుకోవాలన్నారు. బస్సు రోడ్డుపై నడిపే సమయంలో అన్ని దిక్కులా పరిశీలించాలని పేర్కొన్నారు. అతివేగాన్ని నియంత్రించాలని కోరారు.

◆ ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించాలన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వాహనాలను ఓవర్ టేక్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆదర్శ ఉద్యోగులుగా ఎంపికైన డ్రైవర్లను, కండక్టర్లను, మెకానిక్‌లను శాలువా, పూలమాలలతో సత్కరించి ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్, ఆర్టీసీ ఆర్‌ఎం వరప్రసాద్, డిప్యూటీ ఆర్‌ఎం బాలు నాయక్, జగన్, డిపో మేనేజర్ టి.రఘు, ఉత్తమ డ్రైవర్ కరుణాకర్‌రెడ్డి, ఉత్తమ కండక్టర్ సత్తయ్య, ఉత్తమ మెకానిక్ శ్యాంసన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నాగభూషణం అన్నారు. బుధవారం వీఎస్‌టీ చౌరస్తాలోని పార్కులో ట్విన్ సిటీస్ వాకర్స్ క్లబ్ కందూరి కృష్ణ ఆధ్వర్యంలో మేడికవర్ హాస్పటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపు, యోగా సెంటర్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాతా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మురళీధర్‌డు, యోగాగురువు రామ్మోహన్‌రావు, అడ్వకేట్ కౌశిక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ భూములు పేదలకు పంచాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నరసింహ



కాచిగూడ: సీపీఐ భూపోరాటాలకు జడిసి నాటి జాగీర్‌దార్లు, జమీందార్లు, పటేళ్లు, పట్వారీలు ప్రభుత్వానికి దానం చేసిన భూదాన్ భూములను పేదలకు పంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో లక్షన్నర ఎకరాలకుపైగా భూదాన్ భూములు రికార్డుల్లో నమోదై ఉన్నాయన్నారు. గత ప్రభుత్వాల హయాలంలో అప్పటి భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మన్ వందల ఎకరాల భూములను అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు.

◆ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే భూదాన్ బోర్డును రద్దు చేసిందని గుర్తు చేశారు. భూదాన్ బోర్డు రద్దు చేసి సీసీఎల్ఏలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి ఆ భూములను ధరణిలో నిషేధిత జాబితాలో పొందుపరిచిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే వందల ఎకరాల భూదాన భూములు కబ్జాకు గురయ్యాయని వాపోయారు. భూదాన్ భూములను బదలాయించిన అవినీతి అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని కోరారు.

◆ ఇప్పటికైనా ప్రభుత్వం భూదాన్ భూములను కబ్జాదారుల చెర నుంచి విడిపించి వాటి వివరాలను బహిర్గతం చేయాలన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూదాన్ భూములను బడుగు, బలహీనవర్గాల పేదలకు మూడెకరాల చొప్పున పంచాలని కోరారు. పట్టణ ప్రాంతలలో ఉన్న భూదాన్ భూములను పేద, మధ్యతరగతి ప్రజలకు 150 గజాల చొప్పున కేటాయించాలన్నారు. అందులో ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పోరాడతామని అన్నారు.

కచ్చా నాలా పనులు త్వరగా పూర్తి చేయండి



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: కచ్చా నాలా పైప్‌లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్ రోడ్డు శ్రీలక్ష్మీగణపతి దేవాలయం నుంచి జవహర్ స్కూల్ వరకు చేపట్టిన పనులను బుధవారం ఆమె ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... పైపులైన్ పనులతో స్థానికులకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్, వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, జీహెచ్‌ఎంసీ డీఈ గీత, ఏఈ అబ్దుల్ సలామ్, నేతలు రత్న సాయిచంద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మా పోరాటంతోనే విద్యుత్ చార్జీల పెంపు ముప్పు తప్పింది

ఎమ్మెల్యే ముఠా గోపాల్



ఆంధ్ర కేఫ్ చౌరస్తాలో బాణాసంచా కాలుస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: బీఆర్‌ఎస్ పోరాటంతోనే ప్రజలకు విద్యుత్ చార్జీల పెంపు ముప్పు తప్పిందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. విద్యుత్ చార్జీలను పెంపు ఉపసంహరించుకోవడంతో బుధవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ ఆంధ్రకేఫ్ చౌరస్తాలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నిరంతరం విద్యుత్ అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ సర్కార్ విద్యుత్ కోతలతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోందని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు పెంచడం ద్వారా పేదలకు భారంగా మారుతుందని భావించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లు ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిటీ బోర్డుకు విన్నవించారని తెలిపారు. దీంతో చార్జీల పెంపును ఉపసంహరించుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నేత ముఠాజైసింహ, నాయకులు రాకేశ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్, శంకర్ ముదిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. చిక్కడపల్లి ఆరోరా పీజీ కళాశాల విద్యార్థులకు బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదాలు నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సుహాసిని, ట్రాఫిక్ సీఐ వీరేశం, కుష్బూగుప్తా, సాదిఖ్ పాల్గొన్నారు.

పార్లమెంట్ వరకు సమాన వాటా కల్పిస్తాం



ఎస్వీ కేంద్రంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న బొంగు ప్రసాద్‌గౌడ్

- బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షుడు బొంగు ప్రసాద్‌గౌడ్
- జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పిస్తాం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సమతారాజ్య స్థాపనే లక్ష్యంగా బ్లూ ఇండియా పార్టీని స్థాపించామని పార్టీ అధ్యక్షుడు బొంగు ప్రసాద్‌గౌడ్ చెప్పారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బొంగు ప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ... దేశంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలు అత్యధికంగా ఉన్నప్పటికీ కేవలం 15శాతం ఉన్న అగ్రవర్ణాల వారు మాత్రమే అధికారాన్ని చెలాయిస్తున్నారని అన్నారు. జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని రంగాలలో ప్రాతినిధ్యం కల్పిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల నుంచి పార్లమెంట్ వరకు సమాన వాటా కల్పిస్తామని పేర్కొన్నారు.

పారదర్శక ఎన్నికల కోసం ఈవీఎంలను రద్దు చేయాలి..

ఓటు అనేది శక్తి వంతమైన ఆయుధం అని ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దన్నారు. దేశంలో పారదర్శక ఎన్నికల కోసం ఈవీఎంలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలన్నారు. అగ్నిపథ్ పథకాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. కొన్నివర్గాలకే ప్రయోజనం కలిగించే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కమ్మెట భూపాల్, ఉపాధ్యక్షుడు షేక్ అమీనుద్దీన్, జాతీయ సమన్వయకర్తలు గణేష్ భూషణ్, అధికార ప్రతినిధి మధు భూంపల్లి, కార్యదర్శులు బానోతులింగన్న, మాస్టర్‌జీ, కె. శ్రీలత గౌడ్, రావణ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి



ముషీరాబాద్: రాంనగర్‌కు చెందిన దళిత హక్కుల రక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు మంగను కులం పేరుతో అవమానపరిచిన పూజారిని విధుల నుంచి తొలగించాలని మాల కులాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మాస్టర్ దయానంద్, తెలంగాణ మాల మహానాడు సాధన సమితి అధ్యక్షుడు నర్మింట మల్లేశ్ డిమాండ్ చేశారు. బుధవారం రాంనగర్ వైఎస్‌ఆర్ పార్క్ పక్కన ఉన్న రాజరాజేశ్వరి గుడిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానికురాలైన మంగ చిన్నప్పటి నుంచి గుడి పక్కన నివాసం ఉంటూ ఉదయమే గుడి గేటు తెరిచి గుడిలో దీపం వెలగించడం, రాత్రికి గుడి తలుపులు మూయటం లాంటి పనులను ఆమె గత కొన్నేళ్లు నిర్వహిస్తోందని తెలిపారు. గుడిలో పూజారి చీటీలు నిర్వహించడాన్ని ఆమె ప్రశ్నిస్తే దానిపై కోపం పెంచుకున్న పూజారి 'నీకు హారతి ఇవ్వను.. ప్రసాదం పెట్టను'అని భక్తుల సమక్షంలోనే కులం పేరుతో అవమానపరుస్తున్నారని ఆరోపించారు. ఆగస్టులో మంగ ఎస్సీ కమిషన్ మెంబర్‌కు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుకు స్పందించిన ఎస్సీ కమిషన్ పోలీస్ శాఖకు, జీహెచ్‌ఎంసీకి, దేవదాయ శాఖకు, గుడి పూజారికి నోటీసులు ఇచ్చారని తెలిపారు. పోలీస్ శాఖ, జీహెచ్‌ఎంసీ స్పందించినా దేవదాయశాఖ ఇంత వరకు స్పందించలేదన్నారు. వెంటనే స్పందించి ఆ పూజారిని విధుల నుంచి తొలగించి విచారణ చేపట్టాలన్నారు.

'బాగా డ్రైవ్ చేస్తేనే క్షేమంగా గమ్యానికి చేరుతారు'

చిక్కడపల్లి: రథసారథి బాగుంటే ప్రజలంతా బాగుంటారని.. డ్రైవర్ బస్సును బాగా డ్రైవ్ చేస్తేనే ప్రయాణికులు క్షేమంగా ఇంటి చేరుకుంటారని బేగంపేట ట్రాఫిక్ శిక్షణా సంస్థ ఏసీపీ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లిలో ముషీరాబాద్ ఆర్టీసీ డ్రైవర్లకు , సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆర్టీసీ డ్రైవర్లు నిబంధనలు పాటించాలన్నారు. రాంగ్‌రూట్, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ క్విజ్‌లో పాల్గొన్న పలువురికి హెల్మెట్‌లు ప్రదానం చేశారు.

పార్కులు, రోడ్ల అభివృద్ధికి చొరవ తీసుకోవాలి



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో రోడ్లు, పార్కుల అభివృద్ధికి జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారుల ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. పనులు పూర్తి అయిన వాటికి కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించేలా అధికారులే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ పనులు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పూర్తి చేయాలని ఆయన అధికారులకు తెలిపారు. బుధవారం గోల్నాకలోని క్యాంపు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులలో సమీక్ష సమావేశం నిర్వహించారు. చేపట్టిన పనులు పూర్తి అయితే కొత్త పనులు ప్రారంభించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

◆ నియోజకవర్గంలో కొన్ని పార్కులు అభివృద్ధి చేయాల్సి ఉందని వాటిపై దృష్టి సారించాలన్నారు. ప్రాతిపదనలు సిద్ధం చేస్తూ నిధుల మంజూరుకు తాను తోడ్పాటును అందిస్తానన్నారు. క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే నియోజకవర్గానికి కొత్తగా వచ్చిన ఇంజినీర్లను ఎమ్మెల్యే అభినందించి నియోజకవర్గం అభివృద్ధిలో పలు పంచుకొని ప్రజల మన్ననలు పొందలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ రమేశ్‌బాబు, డీఈలు ప్రశాంతి, సంజయ్, ఏఈలు పృథ్వీ, పవన్, శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టరల్‌లు మనోహర్, రవి, రాము, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ దివాళి.. శుభ దివాళి



అంబర్‌పేట: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో స్వచ్ఛ దివాళి.. శుభ దివాళి కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో చేపట్టిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేయొద్దని ఆమె ప్రజలకు సూచించారు. బహిరంగ చెత్త డంపింగ్ కేంద్రం వద్ద రంగురంగుల ముగ్గులు వేసి దీపాలు ముట్టించారు. దశలవారీగా డివిజన్‌లో బహిరంగ డంపింగ్ కేంద్రాలను తొలగించేందుకు అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో హేమాలత, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

రాధాకృష్ణులకు పూజలు

నరక చతుర్థిని పురస్కరించుకొని బుధవారం న్యూనల్లకుంటలోని న్యూరామాలయం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా వేదపండితుడు నాగన్న రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేశారు. హారతులు ఇచ్చి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం వితరణ చేశారు. – నల్లకుంట



మంచి పాటలతో మానసిక ప్రశాంతత

చిక్కడపల్లి: మంచి పాటల వింటే మానసిక ప్రశాంతత కలుగుతుందని కళా బ్రహ్మ వంశీ సంస్థల వ్యవస్థాప అధ్యక్షుడు వంశీ రామరాజు అన్నారు. త్యాగరాయ గానసభలో బుధవారం కళారవిందం సాంస్కృతిక వేదిక నిర్వహణలో సినీ గీతాల కార్యక్రమం జరిగింది. ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాథరావు జన్మదినం సందర్భంగా ఆయనను వంశీ రామరాజు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కళారవిందం నిర్వాహకుడు శ్రీరాంకుమార్, గాయకులు కశ్యప్, శ్యాంసుందర్, కోదండరాం, మధురగాన మయూఖ రేణుకారమేష్, కృష్ణవేణి, అనూష, భార్గవి నాగరాజు, శ్రావణి పాల్గొన్నారు.

